క్లుప్తంగా

ధాన్యానికి బోనస్ ఇచ్చే వరకు పోరాడుతాం

మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇచ్చే వరకు పోరాడుతామని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి అన్నారు. వారు అప్పంపల్లిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500బోనస్ ఇస్తామని చెప్పిమాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉండి బోనస్ ఇచ్చేవరకు ఉద్యమిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పేలా ప్రజలు ఓట్లు వేశారని గుర్తు చేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం



మరికల్: ఆత్మకూర్–మరికల్ మధ్యన బస్సుల కొరత ఉన్నందున ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదమంచున ప్రయాణం చేస్తున్నారు. నిత్యం ఈ రెండు పట్టణాల మధ్యన వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులు నడిపిస్తున్నారు. ప్రతి మూడు గంటలకు ఒకే బస్సు రావడంతో ప్రయాణికులు చేసేది లేక ఆటోలో నిలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్టీసీ అధికారులు స్పందించి నారాయణపేట డిపో నుంచి కూడా అదనంగా మరో రెండు బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

నారాయణపేట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీ యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ శుక్రవారం పేటలో ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కుల గణన చేపట్టి జనాభా, దమాష ప్రకారం 42శాతం సీట్లు బీసీలకు కేటాయించాలన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ ఓటర్లు సిద్ధమవుతారని హెచ్చరించారు. చేతివృత్తుల వారికి వంద శాతం రాయితీతో రూ.2లక్షల నగదు అందించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

గుంతలమయంగా రహదారి



మాగనూర్:మండల పరిధిలోని వడ్వాట్ గ్రామ సమీపంలో అడవిసత్యారం వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. మందిపల్లి రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో వర్షానికి ఈ గుంతలో నీరు నిలుస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నం తిని రెండు ఆవులు మృతి

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో శుక్రవారం రెండు ఆవులు అన్నం తిని మృత్యువాత పడ్డాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా.. ఇటీవల గ్రామ దేవత మారెమ్మ జాతర సందర్భంగా వండిన వంటలు ఎక్కువైన వాటిని గ్రామస్తులు వీధిన పారవేయడంతో ఆ పశువులు వాటిని తిని మృతిచెందినట్లు ఆ పశువుల యాజమాని నాగప్ప, చంద్రప్ప తెలిపారు. వీటి విలువ దాదాపు రూ. 70వేలు వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

ప్రమాదకర బావిని పూడ్చివేయాలి

మాగనూర్: మండల పరిధిలోని పర్మన్‌దొడ్డిలో ప్రధాన రహదరి పక్కన ఓ పురాతన బావి ప్రమాదకరంగా ఉంది. దీంతో గ్రామస్తులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. బావి చుట్టు ముళ్లపొదలతో పేరుకుపోవడంతో బావి ఉన్నట్లు గుర్తించడానికి అవకాశం లేకుండా పోయిందని గ్రామస్తులు అంటున్నారు. దీంతో మూగజీవాలు, చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాసముందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర బావిని పూడ్చివేయాలని కోరుతున్నారు.



బీమాతో.. ధీమాగా

- పోస్టల్‌శాఖ ద్వారా సామూహిక ప్రమాదబీమా
- యాక్సిడెంట్ గార్డ్ పేరిట మరో కొత్త పథకం
- మధ్యతరగతి, పేదలకు ఎంతో ప్రయోజనకరం



జిల్లా పోస్టల్ కార్యాలయంలో పాలసీని అందిస్తున్న ఐపీపీ (ఫైల్)

నర్వ: కరోనా మానవ జీవితాలకు ఎంతో నేర్పించింది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకున్నారు. రోగాల భారిన పడ్డాక రూ. లక్షలు వెచ్చించే బదులు ముందు జాగ్రత్తలో భాగంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వ్యక్తిగత బీమాను చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తపాలశాఖ మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. దీనికి సామూహిక ప్రమాదబీమాగా నామకరణం చేసింది. భవిష్యత్‌లో జీవితానికి ధీమాగా నిలవనున్న ఈ పథకం గురించి ప్రత్యేక కథనం.

పథకం ప్రీమియం చెల్లింపు :

వార్షిక ప్రీమియం రూ. 520 చెల్లిస్తే చాలు. రూ. 10లక్షల బీమా వర్తిస్తుంది. ఇండియన్ పోస్టల్ పేమేంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా ఆ ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

రూ.699 చెల్లిస్తే రూ. 10 లక్షలు వర్తిస్తుంది. (బజాజ్ గ్రూప్ యాక్సిడెంటల్ పాలసి) రిక్స్ క్యాటగిరిస్తో పాటు డ్రైవర్స్‌కు ఎంతో ప్రయోజనకరం.

రూ.549 రూ. 10 లక్షలు (ఆదిత్యాబిర్లా గ్రూప్ ఇన్సురెన్స్)

రూ.550 రూ. 10 లక్షలు (నివాబూపా గ్రూప్ ఇన్సురెన్స్)

పథకం ప్రయోజనాలు:

- ప్రమాదంలో మరణించినా.. శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా.. అవయం కోల్పోయినా.. పక్షవాతం వచ్చినా..రూ.10 లక్షలు చెల్లిస్తారు.
- బీమా తీసుకున్న వ్యక్తి ప్రమాదం జరిగి వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే ఐపీ (ఇన్‌పేషెంట్) కింద రూ. 1లక్ష, ఓపీ (ఔట్‌పేషెంట్) కింద ఖర్చు అందిస్తారు.
- 18– 65 ఏళ్ల మధ్య వయస్సున్న వారంతా అర్హులు.

పాలసీ	మొదటి ఆప్షన్	రెండో ఆప్షన్
ప్రీమియం	399	299
యాక్సిడెంట్	రూ.10 లక్షలు	రూ.10 లక్షలు
శాశ్వత వైకల్యం	రూ. 10 లక్షలు	రూ. 10 లక్షలు
శాశ్వత పాక్షిక వైకల్యం	రూ. 10 లక్షలు	రూ. 10 లక్షలు
మెడికల్ ఖర్చులు	రూ. 60 వేల వరకు	-
ఎడ్యుకేషన్ బెనిఫిట్	ఇద్దరు పిల్లలకి రూ. లక్ష	-
అంత్యక్రియల ఖర్చు	రూ. 5 వేలు	-

- ఆస్పత్రిలో నగదుగా పదిరోజుల వరకు రోజుకు రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తారు.
- విద్యా ప్రయోజనానికి గరిష్టంగా ఇద్దరు పిల్లలకు రుసుంలో పదిశాతం లేదా రూ. లక్ష వరకు ఎంచుకోవచ్చు.
- కుటుంబ ప్రయోజనాలకు రూ. 25వేలు, అంత్యక్రియలకు రూ. 5వేలు, అందిస్తారు.

మినహాయింపులు :

- సాహస క్రీడల్లో పాల్గొనడం
- ఆర్మి, నేవి, ఏయిర్ ఫోర్స్, పోలీస్ శాఖకు చెందిన కష్టమర్లు
- ముందుగా ఉన్న ఏదైన వ్యాధి పరిస్థితి
- డ్రగ్స్, ఆల్కహాల్, ఇతర డ్రగ్స్ ప్రభావంతో ఉండటం
- నేరం, అల్లర్లు దుర్వినియోగంలో పాల్గొనడం
- వైద్యపరంగా అవసరం లేని ఆస్పత్రిలో చేరడం
- ఏదైనా డ్రైవింగ్ వృత్తితో అనుబంధం ఉన్న వ్యక్తులు

పోస్టల్‌శాఖ ద్వారా సేవలందిస్తారు..



ఇండియా పోస్టల్ పేమేంట్స్ బ్యాంకు టాటా ఏఐజీ ద్వారా తపాలాశాఖ గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరిట కొత్త పథకాన్ని అందుబాటు లోకి తీసుకొచ్చింది. ప్రస్తుత పరిస్థితులో అందరికి బీమా అత్యవసరమే. తక్కువ వార్షిక ప్రీమియంతో అత్యధిక ప్రయోజనాలున్నాయి. ఆసక్తి గలవారు స మీప పోస్టాఫీసులో సంప్రదించాలి. పాలసీ చేసుకో లేని పేదలకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

– రవికుమార్, జిల్లా పోస్టల్ ఇన్స్‌స్పెక్టర్, పేట

కనులపండువగా బీరప్ప ఉత్సవాలు



బండారు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: మండలంలోని లింగంపల్లిలో శుక్రవారం బీరప్ప బండారు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. నాలుగురోజుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు పెళ్లికి వచ్చిన పిల్లలకు పట్టం కట్టడం, రెండోరోజు బీరప్పస్వామి బండారు (పసుపు), మూడోరోజు దేవతలకు గొర్రెలు, మేకలు, కోళ్లు బలిస్తారు. నాలుగో రోజు ఎల్లమ్మ బండారు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిస్తాయి. తొమ్మిదేళ్ల ఒకసారి నిర్వహించే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఎల్లమ్మ బండారు ఉత్సవాల్లో దాదాపు 30 వేల మంది భక్తులు పాల్గొని పసుపు బండారు చల్లుకునేందుకు పోటీపడ్డారు. ముందుగా బీరప్ప ఆలయం నుంచి ఊరేగింపుతో వెళ్లారు. ఎల్లమ్మ ఆలయ సమీపంలో బండారును పోటీ పడి పసుపును తమ కుటుంబ సమేతంగా చల్లుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, నాగప్ప, కుర్వ ఆశప్ప, శివప్ప, రాజాగౌడ్, పూజారి రమేష్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బస్సుల నిర్వహణలో ఆర్టీసీ అధికారులు విఫలం



ఇంజన్ వెనక భాగంలో గేర్ రాడ్ పక్కన సిమెంట్

నారాయణపేట రూరల్: సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఎక్కాలంటు ఒక పక్క ప్రచారం చేస్తూనే.. మరో పక్క కాలం చెల్లిన బస్సులు, సరైన నిర్వహణ లేకుండా సర్వీసులను రోడ్లపైకి పంపిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికుల నుంచి ఆర్టీసీపై ఉన్న నమ్మకం, ఆదరణ పోతుందని చెప్పాలి. సరియైన టూల్స్, నట్‌బోల్టులు సైతం బిగించకపోవడంతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని బస్సులకు పూర్తిస్థాయిలో కిటికి అద్దాలు సైతం లేవని వాపోతున్నారు. సరైన మెంటెనెన్స్ లేకుండానే బస్సులను రోడ్లపైకి పంపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. శుక్రవారం మక్తల్ రూట్‌లో నడిచిన పల్లె వెలుగు బస్సుకు ఇంజన్ వెనక భాగంలో పెద్ద సిమెంట్ రాయిని ఉంచారు. ఒకవేళ ఆ రాయిని తొలగిస్తే పెద్ద శబ్దాలు వస్తున్నాయని, ఆ గేర్ రాడ్ సమీపంలో కావాల్సిన టూల్స్ బిగించకపోవడంతో ఇలా జరుగుతుందని తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా ఇలా రాయిని ఉంచే బస్సును నడిపిస్తున్నారని, డిపోలో నిత్యం తనిఖీ చేస్తున్న సిబ్బంది దానిపై దృష్టి సారించక పోవడం విచత్రంగా ఉంది.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. శుక్రవారం మండలంలోని మోమినాపూర్, చెన్నారెడ్డిపల్లి, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగు కాల్వలో నీరు నిల్వకుండా చెత్తను తీసివేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే ఈ గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే నర్సరీలను, ఉపాధి పనులను ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి పరిశీలించారు.

యువత క్రీడల్లో రాణించాలి

కొత్తకోట రూరల్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ మండల నాయకులు వాకిటి రాజమౌళి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడ్డెవాటలో యువకులకు క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు తన సొంత ఖర్చులతో మండలంలోని పలు గ్రామాల్లోని క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశానన్నారు. , క్రీడల్లో రాణిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శంకర్, వెంకటేష్, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



మద్దూరు: మండలంలోని పల్లెర్ల రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులో వెలసిన ఎల్లమ్మకు పల్లెర్ల, మద్దూరు, నందిపాడ్, లక్కుయిపల్లి గ్రామాలకు చెందిన భక్తులు బోనాలు ఊరేగింపు నిర్వహించి తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఈ మేరకు.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఎల్లమ్మను దర్శించుకున్నారు. గ్రామంలోని హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జాతర సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహ, దేవులనాయక్, సంజీవ్, వెంకటయ్యపాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డి విజయం ఖాయం

మరికల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వంశీచంద్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులు రామకృష్ణ, రఘు, గోవర్దన్, ఆంజనేయులు అన్నారు. మండలంలోని శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నెలరోజుల పాటు ఎంతో కష్టపడి ప్రచారం చేశామని ప్రజలు నుంచి కూడా అంతే స్పందన రావడంతో వంశీచంద్‌రెడ్డి విజయం ఖాయమని, దాదాపు 10 వేల మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలి

మరికల్: పాత పంచాయతీ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని కూల్చివేసి అక్కడే కొత్త భవనం నిర్మించాలని బీజేపీ మండల నాయకులు వేణు, రమేష్, వెంకట్రాములు శుక్రవారం సంయుక్త ప్రకటనలో అన్నారు. గత కొంత కాలంగా పాత పంచాయతీ భవనంలో గ్రంథాలయం కొనసాగడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీళ్లు రావడంతో పుస్తకాలు తడిసిపోతున్నట్లు తెలిపారు. పాఠకుల సమస్యను దృష్టిలో ఉంచుకొని భవనం నిర్మాణం చేపట్టాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

వాసవీమాతకు ఘనంగా పూజలు



దేవరకద్రలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి అభిషేకం చేయించి ప్రత్యేక అలంకారంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

నేడు వాసవీమాత జయంతి వేడుకలు

దేవరకద్రలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి సందర్భంగా 108 కళశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారని దేవస్థాన కమిటీ వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందని, మధ్యాహ్నం మహా మంగళ హారతి అనంతరం ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు మహాగణపతిపూజతో ప్రారంభం చేశారు. ధ్వజారోహణం, సర్వతోభద్ర మండప, యోగినిమండప, నవగ్రహపూజలు చేపట్టారు. గద్వాల చంద్రశేఖర్‌రావు బృందంతో చేపట్టిన భక్తిసంగీత కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి చంద్రయ్య, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జడ్చర్లలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ మేరకు.. విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీం ఉంటాయనే విషయంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. మహిళలు, బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమపేరుతో వేదింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్‌టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో బాలరాజు, నమీనా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌పుస్తకాలు అందిస్తున్న మహిపాల్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రం మినీస్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బాలకేంద్రంలో సంగీత శిక్షణకు హాజరవుతున్న చిన్నారులకు శుక్రవారం ఉచితంగా నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన అన్వార్ బస్వరాజ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పిల్లలకు నోట్‌పుస్తకాలతో పాటు స్నాక్స్ అందించారు. ఈ సందర్భంగా బాల కేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు కళలలో ప్రావిణ్యం సంపాదించుకునేందుకు తల్లిదండ్రులు ఆలోచించాలన్నారు. వేసవి శిక్షణ శిబిరానికి చిన్నారులను పంపించాలని, తబల, నృత్యం, గాత్రం, చిత్రలేఖనం తదితర విషయాల్లో శిక్షణ ఇచ్చి సరిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, లక్ష్మణ్, వసంత్, రామకృష్ణ, జ్ఞానామృత, రఘు, సతీష్ పాల్గొన్నారు.

కాలనీవాసులకు స్వచ్ఛందంగా నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

కోస్గి: పట్టణంలోని 9వ వార్డులో గతకొంత కాలంగా నీటి ఎద్దడి ఏర్పడటంతో మాజీ వార్డు సభ్యుడు వెంకట్ నర్సింహులు తన సొంత ట్యాంకర్ ద్వారా స్వచ్ఛందంగా నీరు సరఫరా చేశారు. కాలనీలో నీటి సమస్య ఉంటడంతో సొంత ఖర్చులతో నీటిని సరఫరా చేశామని, మున్సిపల్ కమిషనర్ పట్టణంలో నీటి సమస్య ఉన్న కాలనీలను గుర్తించి అవసరమైతే ట్యాంకర్లు ఏర్పాటుచేసి నీరు సరఫరా చేయాలని మాజీ వార్డు సభ్యుడు వెంకట్ నర్సింహులు కోరారు. కాగా వెంకట్ నర్సింహులు చొరవ తీసుకొని నీటిని సరఫరా చేయడంతో కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

కార్మికులకు చెక్కులు అందజేత



కార్మికులకు చెక్‌లు అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికులకు ప్రసూతి కానుక, మ్యారేజీ గిఫ్టులను కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనకారాయుడు అందించారు. కార్మిక శాఖ ద్వారా శివలింగమ్మకు, మణెమ్మలకు ఒక్కొక్కరికీ రూ. 30వేల చెక్కులను అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులు, ఆస్పత్రి ఖర్చుల ధరలు పెరిగాయని ప్రభుత్వం స్పందించి ప్రసూతి కానుకలను రూ. 30వేల నుంచి 50వేలకు పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, కృష్ణయ్య, కుర్వ లింగప్ప, బాలకిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పూడికతీత పనుల పరిశీలన



సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 45వ వార్డు పరిధిలోని కొత్తచెరువు కాల్వలో ట్రాక్టర్‌తో చేపట్టిన పూడికతీత పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కాల్వ చివరి వరకు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు నిల్వ ఉండకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో 47వ వార్డు కౌన్సిలర్ సి.గోవిందు, కాంగ్రెస్ నాయకుడు చిన్న పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న డ్రైయినేజీలు



రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న డ్రైయినేజీలపై నిర్మాణాలు ఇలా..

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల నిర్మించిన డ్రైయినేజీలు, ఆయా వార్డుల్లోని డ్రైయినేజీలు ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని మున్సిపల్ అధికారులు నివారించలేకపోతున్నారు. డ్రైయినేజీలపై స్లాబ్‌లు వేయడంతో పారిశుద్ధ్య కార్మికులు మురుగు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇస్తున్న మున్సిపల్ అధికారులు, ఇంటి నిర్మాణ సమయాల్లో ఇచ్చిన అనుమతి ప్రకారమే ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోలేకపోవడంతో యాథేచ్ఛగా డ్రైయినేజీలు కబ్జా చేసుకుంటూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిసారించి కాల్వలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

వైభవంగా సాగుతున్న ఆరాధన మహోత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు



పోటీలను తిలకిస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి, వేంకటేశ్వరస్వామి, శివలింగ ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భజన పోటీలు రెండో రోజు కొనసాగాయి. సాయంత్రం స్వామివారి రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా శనివారం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, భజనలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వల్ల శేఖరాచారి, అధ్యక్షులు ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ తెలిపారు. కార్యక్రమాల్లో కమిటీ కోశాధికారి నారాయణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు మణికొండ నర్సింహాచారి, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సత్తయ్యాచారి, కార్యదర్శి రమేష్, భీమాచారి, భాగన్నగౌడ్, లక్ష్మీనారాయణ, సుధాకరాచారి, భాస్కరాచారి, రాఘవాచారి రవితదితరులు పాల్గొన్నారు.